పేరుకే వార్డు కార్యాలయం!

అధికారులు, సిబ్బంది ఉండరు

- ఫ్యాన్లు, కంప్యూటర్లను ఎత్తుకెళ్లిన దొంగలు
- కనిపించని కుర్చీలు, టేబుళ్లు
- వ్యర్థ సామగ్రి, డస్ట్‌బిన్లతో నిండిపోయిన సిబ్బంది గదులు
- వెంకటేశ్వరనగర్ కాలనీ డివిజన్ వార్డు ఆఫీస్ దుస్థితి ఇదీ





వార్డు కార్యాలయంలో నిర్మాణ సామగ్రి, దొంగలు ఫ్యాన్లను ఎత్తుకుపోవడంతో సీలింగ్‌లో మిగిలిన రాడ్లు



వార్డు ఇంజనీర్ కార్యాలయంలో పనికి రాని వస్తువుల గుట్ట

బంజారాహిల్స్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు చేరువలో ఉండి పాలన అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వార్డు కార్యాలయాల లక్ష్యం నెరవేరడం లేదు. అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా వార్డు ఆఫీసులు చాలా చోట్ల అలంకార ప్రాయంగా మారుతున్నాయి. ప్రజా పాలన విజయోత్సవాల పేరిట ప్రభుత్వం ఓ వైపు వేడుకలు నిర్వహిస్తుండగా, జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్య ధోరణి విమర్శలకు తావిస్తోంది. వెంకటేశ్వరనగర్ కాలనీ డివిజన్ వార్డు కార్యాలయమే ఇందుకు ఉదాహరణ.

ఉన్నతాధికారుల నిర్లక్ష్యం, సిబ్బంది అలసత్వం

అన్ని ప్రభుత్వ శాఖలను ప్రజలకు దగ్గరకు తీసుకొచ్చి వారి సమస్యలను తక్షణం పరిష్కరించాలని భావించి ప్రభుత్వం జీహెచ్ఎంసీ పరిధిలో అన్ని డివిజన్లలో వార్డు కార్యాలయాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 7లోని ఈ సేవా కేంద్రం పైఅంతస్తులో ఉన్న జీహెచ్ఎంసీ కార్యాలయాన్ని వార్డు ఆఫీసుగా తీర్చిదిద్దారు. కొత్త ఫర్నిచర్, ఫ్యాన్లు, కంప్యూటర్లు.. ఇలా సకల వసతులు కల్పించడంతో పాటు జలమండలి, ట్రాన్స్‌కో, జీహెచ్ఎంసీ తదితర అన్ని విభాగాలకు వేరు వేరుగా చాంబర్లు సిద్ధం చేసి, ప్రత్యేక గదులు ఏర్పాటు చేశారు. ఫిర్యాదు చేయడానికి వచ్చే ప్రజల కోసం కుర్చీలు, మంచినీటి వసతి కల్పించారు. ఆరు గ్యారెంటీల దరఖాస్తుల కోసం ఈ వార్డు కార్యాలయం ప్రజలకు ఎంతో ఉపయోగపడింది. అయితే ఉన్నతాధికారుల నిర్లక్ష్యం, సిబ్బంది అలసత్యం కారణంగా వార్డు ఆఫీసు పనితీరులో క్రమంగా మార్పు రావడం మొదలైంది. సిబ్బంది వార్డు కార్యాలయానికి రావడం మానేశారు. దీంతో ప్రజలు కూడా తమ కాలనీల్లోని సమస్యలపై అధికారులకు ఫిర్యాదులు చేసేందుకు రావడం మానేశారు. ఫలితంగా వార్డు కార్యాలయం నిరుపయోగంగా మారింది.

గదుల్లో పాతసామగ్రి, డస్ట్‌బిన్లు..

అధికారులు, సిబ్బంది రాకపోవడంతో వార్డు కార్యాలయంలోని గదులు, చాంబర్లు ప్రస్తుతం వ్యర్థ సామగ్రి, నిర్మాణ సామగ్రితో నిండిపోయాయి. ఎటు చూసినా అసహ్యకరమైన వాతావరణమే కనిపిస్తోంది. జీహెచ్ఎంసీ రోడ్లపై ఏర్పాటు చేసే డస్ట్‌బిన్లను కొన్ని చాంబర్లలో డంప్ చేశారు. విద్యుత్ అధికారుల కార్యాలయంలో పాడైన ఏసీ యూనిట్‌లు, ఖాళీ డబ్బాలు దర్శనమిస్తున్నాయి. ఇక కంప్యూటర్ గది అయితే మురికి కూపంగా మారింది. ఎలుకలు తిరుగుతున్నాయి. గది అంతా జుగుప్సాకరంగా తయారైంది. పరిస్థితి ఇలాగే ఉంటే భవిష్యత్తుల్లో వార్డు కార్యాలయాన్ని చెత్త కుండీగా మార్చివేసినా ఆశ్చర్యపోనవసరం లేదు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ప్రజా ధనం ఎలా వృథా అవుతుందో అనడానికి ఈ వార్డు కార్యాలయమే తార్కాణం. ఈ విషయంపై పాలకులు ఎలా స్పందిస్తారో వేచి చూద్దాం.

కంప్యూటర్లు, ఫ్యాన్లు మాయం

వార్డు కార్యాలయాన్ని అధికారులు పట్టించుకోపోవడంతో ఇక్కడ ఏర్పాటు చేసిన సీలింగ్ ఫ్యాన్లలో ఒక్కొక్కటిగా 8 ఫ్యాన్లు మాయమయ్యాయి. అలాగే, కంప్యూటర్లు, ప్రింటర్లను కూడా దొంగలు ఎత్తుకెళ్లారు. కుర్చీలు, బల్లలుతో పాటు అనేక విలువైన సామగ్రి కనిపించకుండా పోయాయి. అధికారులకు ఈ విషయం తెలియదు. సిబ్బందికి తెలిసినా మనకెందుకులే అనే వదిలేశారు.



కంప్యూటర్ గదిలో ఖాళీ అట్ట డబ్బాలు



సిబ్బంది కూర్చునే చోట చెత్త కుండీలు



క్రిస్మస్ కేక్‌ను కట్ చేస్తున్న ఎమ్మెల్యే తలసాని

ప్రపంచ వ్యాప్తంగా జరుపుకొనే పండుగ క్రిస్మస్

అమీర్‌పేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రపంచం మొత్తంగా జరుపుకునే ఏకైక పండుగా క్రిస్మస్ అని మాజీ మంత్రి సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా వెస్ట్ మారేడ్‌పల్లిలోని ఎమ్మె ల్యే కార్యాలయంలో ఎస్ఆర్ నగర్‌లోని క్రిస్టియన్ ఫెలో షిప్ చర్చి ఆధ్వర్యంలో తలసాని కేక్‌ను కట్ చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అన్ని కులాలు, మతాలను సమానంగా గౌరవించి కానుకలను అందజేసిన విషయాన్ని ఆయన ఈ గుర్తు చేశారు. క్రిస్మస్‌ను సుఖసంతోషాలతో జరుపుకోవాలని వారికి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చర్చి ఫాస్టర్ జాయ్ సీమన్ పీటర్, ప్రతినిధులు పాల్ బసవయ్య, జాకీర్ హుస్సేన్, జాకోబ్, షీబా పాల్, బీఆర్ఎస్ పార్టీ నాయకులు సంతోష్, అశోక్ యాదవ్, కూతురు నర్సింహ పాల్గొన్నారు.



రైల్వే ఏడీఎంఆర్‌కు వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ వనం సంగీతయాదవ్

'నీటి వాల్వ్ మూసివేత'తో ఇక్కట్లు

- సమస్యను పరిష్కరించాలని రైల్వే ఏడీఎంఆర్‌కు వినతి

బేగంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సోమాజిగూడ డివిజన్‌లోని ఎంఎస్ మక్తా సమీపంలోని రైల్వే లైన్ కింద నుంచి నెక్లెస్ రోడ్డుకు వెళ్లే నీటి వాల్వ్‌ను మూసివేయడంతో బస్తీవాసులు ఇబ్బందులు పడుతున్నారని కార్పొరేటర్ వనం సంగీతయాదవ్ అన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆమె మంగళవారం సికింద్రాబాద్‌లోని రైల్వే నిలయంలో ఏడీఎంఆర్ గోపాలకృష్ణను కలిసి వినతి పత్రం అందజేశారు. స్పందించిన ఏడీఎంఆర్ తాను స్వయంగా ఆ ప్రాంతాన్ని పరిశీలించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని కార్పొరేటర్ తెలిపారు.



యజ్ఞంలో పాల్గొన్న హనుమాన్ మాలధారులు, భక్తులు

వైభవంగా హనుమాన్ గాయత్రి మహాయజ్ఞం

బంజారాహిల్స్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఫిలింనగర్‌లోని వినాయక నగర్ పర్వతాంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ గాయత్రి మహాయజ్ఞ మహోత్సవ పూజలు మంగళవారం వైభవంగా జరిగాయి. ఇందులో భాగంగా స్వామివారికి వేకువ జామునే అభిషేకం, గాయత్రి హోమం నిర్వహించారు. ప్రతి యేటా ఇరుముడి కట్టుకోవడానికి ముందు రోజు గాయత్రి యజ్ఞాన్ని నిర్వహించుకోవడం ఆనవాయితీగా వస్తున్నదని ఆలయ అర్చకుడు రామానుజా చార్యులు తెలిపారు. కాగా, యజ్ఞమహోత్సవంలో హనుమాన్ మాలలు వేసిన స్వాములతో పాటు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేసినట్టు నిర్వాహకుడు సంపంగి మురళీకృష్ణ గురుస్వామి తెలిపారు. కార్యక్రమంలో రామకృష్ణ గురుస్వామి, ఈదమయ్య గురుస్వామి, ఓర్సు శ్రీను, కరుణాకర్, శేఖర్, లింగరాజు, తిరుపతయ్య, రత్నయ్య, శ్రీరాములు, వెంకటయ్య, అల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణపై తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై

చర్యలు తీసుకోండి



పోలీసు అధికారికి ఫిర్యాదు పత్రాన్ని అందజేస్తున్న కార్తీక్‌రెడ్డి

బంజారాహిల్స్, డిసెంబరు 10 (ఆంధ్ర జ్యోతి): తెలంగాణపై సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి కుమారుడు కార్తీక్ రెడ్డి మంగళవారం బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తెలంగాణ రాష్ట్రం, తెలుగుతల్లి ప్లై ఓవర్ విషయంలో కొంత మంది పనిగట్టుకొని రాష్ట్రం పేరు మసకబారేలా సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి వారి చర్యలు తెలంగాణ ప్రజల మనోభావాలు దెబ్బతినేలా ఉన్నాయని, బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఆయన ఫిర్యాదులో కోరారు. బంజారాహిల్స్ పోలీసులు ఫిర్యాదును స్వీకరించి న్యాయ సలహాకు పంపించారు.



మంత్రుల నివాసాల ముట్టడికి యత్నిస్తున్న బీసీ విద్యార్థి సంఘం నాయకులను అడ్డుకుంటున్న పోలీసులు

మంత్రులు నివాసాల ముట్టడికి యత్నం

బంజారాహిల్స్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): స్కాలర్ షిప్‌లు, ఫీజు బకాయిలు చెల్లింకుండా ప్రభుత్వం విజయోత్సవాల పేరుతో కాలయాపన చేస్తున్నదని రాష్ట్రా బీసీ విద్యార్థి సంఘం అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆరోపించారు. 14.75 లక్షల మంది విద్యార్థుల ఫీజు బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ బీసీ విద్యార్థి సంఘం మంగళవారం బంజారాహిల్స్ రోడ్డు నెంబరు 12లోని మంత్రుల నివాసాలను ముట్టడించేందుకు ప్రయత్నించారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ రోడ్డుపై బైఠాయించిన విద్యార్థి సంఘం నాయకులు ఒక్కసారిగా మంత్రుల నివాసాల్లోకి వెళ్లేందుకు యత్నించగా, పోలీసులు అడ్డుకొని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వేముల రామకృష్ణ మాట్లాడుతూ, బడుగు, బలహీన వర్గాలకు ఇచ్చే స్కాలర్ షిప్‌లను పూర్తిగా ఎత్తి వేసేందుకు కొందరు అధికారులు కుట్ర పన్నుతున్నారని ఆరోపించారు. దీన్ని వల్ల అనేక మంది విద్యార్థులు చదువుకు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలులోకి వచ్చాక గ్రామీణ ప్రాంత విద్యార్థులు ఎంతో లబ్ధి పొంది ఉన్నత స్థితికి చేరుకున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే ఫీజు బకాయిలను విడుదల చేసి విద్యార్థులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నీలం వెంకటేష్, చంద్రశేఖర్, నర్సింహ,విజయ్, అరవింద్,శివ,కొండా విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ తల్లికి బీఆర్ఎస్ నేతల క్షీరాభిషేకం



తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, కార్పొరేటర్లు రాజ్‌కుమార్ పటేల్, దేదీప్యరావు



తెలంగాణ భవన్‌లో.. క్షీరాభిషేకం చేసిన కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి, ఖైరతాబాద్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి

బంజారాహిల్స్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు పార్టీ నాయకులు మంగళవారం తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. కృష్ణకాంత్‌పార్కు వద్ద తెలంగాణ తల్లి చిత్రపటానికి జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్, కార్పొరేటర్లు దేదీప్యరావు, రాజ్‌కుమార్‌పటేల్ పాలాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, తెలంగాణ తల్లికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు బీఆర్ఎస్ కృషి చేస్తుందన్నారు. తెలంగాణ భవన్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి వెంకటేశ్వర నగర్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి, బీఆర్ఎస్ ఖైరతాబాద్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి, ఉద్యమ నాయకుడు రాంచందర్ క్షీరాభిషేకం చేశారు.



పోటీలను ప్రారంభించి మాట్లాడుతున్న ఎమ్మార్వో పద్మసుందరి

సీఎం కప్ ఆటల పోటీలు ప్రారంభం

అమీర్‌పేట, డిసెంబర్ 10(ఆంధ్రజ్యోతి): సీఎం కప్-2024 అమీర్‌పేట మండల స్థాయి ఆటల పోటీలు అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ ఆధ్వర్యంలో రెవెన్యూ, విద్యాశాఖల సంయుక్త నిర్వహణలో మంగళవారం ధరమ్ కరమ్ రోడ్డులోని గురుగోవింద్ సింగ్ ప్లే గ్రౌండ్‌లో ఈ పోటీలను అమీర్‌పేట తహసీల్దార్ పి. పద్మసుందరి ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీల్లో కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, అథ్లెటిక్ పోటీలను నిర్వహిస్తారు. పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. కాగా, తొలి రోజు పోటీలు గురుగోవింద్ సింగ్ ప్లే గ్రౌండ్‌లో ముగిశాయని, మిగతా రెండు రోజుల పోటీలు 11, 12వ (నేడు, రేపు) తేదీల్లో సనత్‌నగర్ డివిజన్‌లోని లేబర్ వెల్ఫేర్ గ్రౌండ్‌లో కొనసాగుతాయని డిప్యూటీ విద్యాశాఖ అధికారి యాదయ్య తెలిపారు. మండల స్థాయి పోటీల్లో విజేతలను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో డీటీఓ మాధవి, స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి బాలకృష్ణ, కోచ్‌లు హేమలత, ప్రవీణ్, అష్రఫ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

తండ్రి మందలించాడని.. ఇంటి నుంచి వెళ్లిపోయాడు



అభిషేక్

ఖైరతాబాద్,డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): తండ్రి మందలించడంతో అలిగిన ఓ బాలుడు ఇంటి నుంచి ఎటో వెళ్లిపోయాడు. ఖైరతాబాద్ ఎస్ఐ సందీప్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఖైరతాబాద్ లక్ష్మీ నగర్ నివాసి అబ్రహం కుమారుడు అభిషేక్(14) స్థానిక నిశుల్క్ ప్రభాత్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్నాడు. సోమవారం అభిషేక్ స్కూల్‌కు వెళ్లకుండా స్నేహితులతో కలిసి ఆడుకుంటుండగా తండ్రి గమనించి మందలించాడు. దీంతో మనస్తాపానికి గురైన బాలుడు రాత్రి 9 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. అంతటా వెతికినా, ప్రయోజనం లేకపోవడంతో తండ్రి మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాలుడు నల్లగా ఉంటాడని, తెలుగు, హిందీ మాట్లాడతాడని, ఇంటి నుంచి వెళ్లేటప్పుడు తెల్లటి దుస్తులు ధరించాడని, ఆచూకీ తెలిసిన వారు ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్‌లో లేదా.. ఫోన్ నెంబరు8712661534లో సంప్రదించాలని ఎస్ఐ సందీప్ రెడ్డి కోరారు.



అభివాదం చేస్తున్న తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయాల కాంట్రాక్ట్ అధ్యాపక సంఘం ప్రతినిధులు

ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

- విశ్వవిద్యాలయాల కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం డిమాండ్

పంజాగుట్ట, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని విశ్వవిద్యాలయాల్లో పని చేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలను పరిష్కరించాలని, కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన హామీలను అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యా లయాల కాంట్రాక్ట్ అధ్యాపకుల సంఘం డిమాండ్ చేసింది. యూజీసీ పేస్కేల్‌ను అమలు చేసిన తర్వాతే యూనివర్సిటీల్లో అధ్యాపక నియామకాలు చేపట్టాలని సంఘం కన్వీనర్ డాక్టర్ ధర్మతేజ, సమన్వయకర్త డాక్టర్ ఉపేందర్ కోరారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్రంలోని 12 విశ్వవిద్యాల యాల ప్రతినిధులతో కలిసి వారు మాట్లాడారు. గత ప్రభుత్వం రాష్ట్రంలోని విశ్వ విద్యాలయాలలో పనిచేస్తున్న 1400 మంది అధ్యాపకులను రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చి మోసం చేసిందని ఆరోపించారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే కాంట్రాక్ట్ అధ్యాపకులను రెగ్యులరైజ్ చేసి యూజీసీ పే స్కేల్ అమలు చేస్తామని హామీ ఇచ్చిందని, అధికారంలోకి వచ్చి ఏడాదైనా హామీని నెరవేర్చలేదని ధర్మతేజ, ఉపేందర్‌లు పేర్కొన్నారు. తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, బేసిక్, డీఏ,హెచ్ఆర్ఏ, మూడు శాతం ఇంక్రిమెంట్ ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డికి వారు విజ్ఞప్తి చేశారు. తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేస్తే త్వర లో జరిగే పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ ఓట్లను గంపగుత్తగా కాంగ్రెస్ అభ్యర్థులకు వేసి గెలిపిస్తామని, ప్రభుత్వం స్పందించకపోతే త్వరలోనే భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. సమావేశంలో వివిధ విశ్వవిద్యాలయాల ప్రతినిధులు శ్రీధర్‌రెడ్డి, డాక్టర్ సత్యనారాయణ, డాక్టర్ దత్తు, రవీందర్, నారాయణ,రాజు, రాంచంద్రుడు, డాక్టర్ సునీత, విజయేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



బీకే గూడలో నిర్వహించిన పడిపూజకు హాజరైన ఎమ్మెల్యే తలసాని

అయ్యప్పను పూజించడం గొప్ప పుణ్య కార్యం

అమీర్‌పేట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అయ్యప్ప మాలధారణను ధరించి 41 రోజుల పాటు ఎంతో నిష్ఠతో అయ్యప్ప స్వామిని పూజించడం గొప్ప పుణ్య కార్యమని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బీకేగూడలోని నీరుడు కృష్ణ నివాసం వద్ద నిర్వహించిన పడిపూజకు తలసాని హాజరై స్వామి వారికి పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు తలసానిని సన్మానించారు. ఎమ్మెల్యే వెంట బీఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు కొలన్ బాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి పుట్టల శేఖర్, నాయకులు ప్రవీణ్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, రాజేష్ ముదిరాజ్, కట్టా బలరాం, ఆకుల రాజు, కుమార్, గుడిగె శ్రీనివాస్ ఉన్నారు.



ఆరోగ్యశ్రీ డిస్ట్రిక్ట్ మేనేజర్ మెహబూబ్ పాషా, టీమ్‌లీడర్ సంతోష్‌లను సన్మానిస్తున్న ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్యదేవరాజ్

ఆరోగ్యశ్రీ అధికారులకు సన్మానం

బేగంపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వివిధ ఆరోగ్య సమస్యలతో ప్రజావాణికి వచ్చే వారికి సత్వర వైద్యం అందేలా ఆరోగ్యశ్రీ అధికారులు కృషి చేస్తున్నారని ప్రజావాణి ఇన్‌చార్జి చిన్నారెడ్డి, నోడల్ అధికారి దివ్య దేవరాజన్‌లు తెలిపారు.. ప్రజావాణి ప్రారంభమై ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రజాభవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ హైదరాబాద్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మహమ్మద్ మెహబూబ్ పాషా, ప్రజావాణి ఆరోగ్యశ్రీ టీం లీడర్ సంతోష్‌లను డా.చిన్నారెడ్డి, దివ్య దేవరాజన్‌లు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశ్రీ అధికారులు పాల్గొన్నారు.



చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామికి వినతిపత్రం అందజేస్తున్న తెలంగాణ మాదిగ చర్మకారుల సంఘాల జేఏసీ నాయకులు సతీష్ మాదిగ, శ్రీనివాస్ తదితరులు

రాష్ట్రంలోని లెదర్ పార్కులకు పూర్వవైభవం తేవాలి

పంజాగుట్ట,డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ గచ్చిబౌలిలో ఉన్న లెదర్ పార్కుతో పాటు రాష్ట్రంలోని మరో 12 ప్రాంతాల్లో ఉన్న మెగా, మినీ లెదర్ పార్కులకు పూర్వవైభవం తేవాలని తెలంగాణ మాదిగ చర్మకారుల సంఘాల జేఏసీ కో ఆర్డినేటర్ దేవని సతీష్ మాదిగ, కన్వీనర్ శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వా నికి విజ్ఞప్తి చేశారు. ఆయా ప్రాంతాల్లో లెదర్ పార్కులకు కేటాయించిన భూముల్లో కొన్ని వివిధ అవసరాల కోసం ప్రభుత్వం తీసుకోగా, ప్రస్తుతం కొన్ని భూములే మిగిలాయని, వాటినైనా కాపాడాలని వారు కోరారు. చెన్నూరు ఎమ్మెల్యే జి.వివేక్ వెంకటస్వామిని మంగళవారం ఆయన నివాసంలో కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ మాదిగ, శ్రీనివాస్ మాట్లాడుతూ, చెన్నూరు నియోజకవర్గంలో లెదర్ పరిశ్రమ మూతపడిందని, ఆ భూమి లోనుంచి రహదారి నిర్మించేందుకు యత్నించగా వివేక్ వెంకటస్వామి అడ్డుకున్నారన్నారని అన్నారు. మిగతా ప్రాంతాల్లో ఉన్న లెదర్ పార్కుల భూములు అన్యాక్రాంతం కాకుండా ఉండడానికి, సమస్యను అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించాలని ఎమ్మెల్యేను కోరామని వారు తెలిపారు. రాష్ట్రంలో సుమారు 40 లక్షల వరకు మాదిగ జనాభా ఉందని, ఉపాధి, ఉద్యోగాలు లేక మాదిగ యువత తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు అన్నారు. నిరుద్యోగ యువతకు తోలు పరిశ్రమలో నైపుణ్యాల అభివృద్ధి కోసం శిక్షణ ఇప్పించాలని, స్కిల్ డెవల ప్‌మెంట్ యూనివర్సిటీలో లెదర్ కోర్సులను ప్రవేశపెట్టి ఆ సీట్లు అన్నీ మాదిగలకే కేటాయించాలని వారు కోరారు. మాదిగ దండోరా రాష్ట్ర ఉపాధ్యక్షుడు మెంటేపల్లి రాములు, మాధవ రెడ్డి, బొల్లి కిషన్, మామిడి గోపి, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.



ఎపీఆర్ హిల్స్‌గ్రౌండ్‌లో నిర్వహించే గ్రాండ్ క్రిస్మస్ వేడుకల ఏర్పాట్లను పరిశీలిస్తున్న రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి. - (యూసుఫ్‌గూడ, ఆంధ్రజ్యోతి)



అమ్మవారి పంచలోహ విగ్రహ అభిషేక పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేష్

ముత్యాలమ్మ ఆలయంలో చండీయాగం

రెజిమెంటల్‌బజార్, డిసెంబర్ 10 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కుమ్మరిగూడలోని ముత్యాలమ్మ దేవాలయంలో ముత్యాలమ్మ దేవి పంచలోహ విగ్రహ కళాన్యాస పూర్వక పునఃప్రతిష్ఠా మహోత్సవం పూజలు రెండో రోజు వైభవంగా జరిగాయి. మంగళవారం ఉదయం 81 కలశాలు, ద్రవ్యాలతో మహాస్నపనం, చండీయాగం, దాన్యాధివాసం సాయంత్రం శయాదివాసం పూజలు నిర్వహించారు. కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్, కార్పొరేటర్ కొంతం దీపిక పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ..ఈ పూజల్లో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. బుధవారం జరిగే అమ్మవారి ప్రాణ ప్రతిష్ఠ పూజల్లో దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ, జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, కలెక్టర్, దేవాదాయ కమిషనర్ పాల్గొంటారని తెలిపారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం : ఎమ్మెల్యే

మారేడుపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారమే లక్ష్యముగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. సోమవారం కంటోన్మెంట్ పికెట్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ మెప్మా రిసోర్స్‌పర్సన్స్ యూనియన్ సభ్యులు కలిసి తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ వినతి పత్రం అందించారు. జీఓ నెం 60 ప్రకారం ఆర్పీలకు వేతనాలు చెల్లించాలన్నారు. ఆర్పీలకు రూ.10 లక్షల సాధారణ బీమా సౌకర్యం, హెల్త్‌కార్డులు, గుర్తింపుకార్డులు ఇవ్వాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. విషయాన్ని సంబంధిత అధికారులు, మంత్రి దృష్టికి, సీఎం దృష్టికి తీసుకువెళ్లి, పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో భాగ్యరెడ్డి, మంజలతో పాటు పలువురు ఆర్పీలు పాల్గొన్నారు.



సీతాఫల్‌మండిలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కార్పొరేటర్ సామల హేమ, బీఆర్ఎస్ నాయకులు

తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం

బౌద్ధనగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, సికింద్రాబాద్ ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్ ఆదేశాల మేరకు మంగళవారం సీతాఫల్‌మండి చౌరస్తాలో తెలంగాణ తల్లి చిత్రపటానికి కార్పొరేటర్ సామల హేమ, బీఆర్ఎస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. అనంతరం ఎమ్మెల్యే కార్యాలయం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు నాయకులు, కార్యకర్తలతో కాంగ్రెస్ తల్లి వద్దు, తెలంగాణ తల్లి ముద్దు అంటూ నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. తెలంగాణ తల్లి విగ్రహాన్ని ప్రతిష్ఠాపనను వ్యతిరేకిస్తున్నామని కార్పొరేటర్ తెలిపారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి సంవత్సర కాలం పూర్తి అయిన సందర్భంగా ఆరు గ్యారెంటీలు అమలు చేయకపోవటాన్ని నిరశిస్తూ కార్పొరేటర్ హేమ, నాయకులు, కార్యకర్తలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో నాయకులు శైలేందర్, జాకీర్, కరీంలాలా, శరణ్, లక్ష్మి, విజయ, జ్యోతి, లలిత, సరోజిని, ప్రవళిక, జాన్సీ తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణతల్లికి పంచ అమృత అభిషేకం కార్యక్రమంలో పాల్గొన్న టీఎస్‌బీసీఎల్ మాజీ చైర్మన్ గజ్జెల నగేష్ తదితరులు

అన్నానగర్‌చౌరస్తాలో పంచ అమృతాభిషేకం

సికింద్రాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఉద్యమ సమయంలో పుట్టిన తెలంగాణతల్లి విగ్రహం మార్పుని నిరసిస్తూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపుమేరకు మంగళవారం అన్నానగర్ చౌరస్తాలో టీఎస్‌బీసీఎల్ మాజీ చైర్మన్ గజ్జెల నగేష్ ఆధ్వర్యంలో తెలంగాణ తల్లికి పంచ అమృతాభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గజ్జెల నగేష్ మాట్లాడుతూ ఉద్యమంలో ప్రజలు కోరుకున్న తెలంగాణ తల్లి విగ్రహాన్నే బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక పెట్టిందన్నారు. తెలంగాణతల్లి విగ్రహం నుంచి బతుకమ్మ వేరుచేసి తెలంగాణ ఆడపడుచులను అవమానపర్చారన్నారు. తెలంగాణ తల్లిని మార్చి కాంగ్రెస్ తల్లిగా మార్చారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీబోర్డు సభ్యులు అనిత ప్రభాకర్, మాజీ మార్కెట్ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్, నాయకులు జంగిలి రాజు, సాయికిరణ్, కనకయ్య, షేర్వాణ్, మురళియాదవ్, సంతోష్, కిరణ్, దేవులపల్లి శ్రీనివాస్, వార్డు అధ్యక్షుడు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పక్కదారి

- రాత్రుళ్లు ద్విచక్రవాహనాలపై రహస్య స్థావరాలకు తరలింపు
- అక్కడి నుంచి వాహనాల్లో బయటకు..
- రోజూ 30 క్వింటాళ్లు అక్రమ రవాణా?



వారాసిగూడ పుల్లయ్యబావిలో ఓ ఇంటి బయట అక్రమంగా ఉంచిన రేషన్ బియ్యం బస్తాలు

బౌద్ధనగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పేదప్రజలకు అందాల్సిన రేషన్ బియ్యం(పీడీఎస్) పక్కదారి పడుతున్నాయి. రాత్రికి రాత్రే రేషన్ బియ్యాన్ని వాహనాల్లో అక్రమార్కులు బయటకు తరలిస్తున్నారు. కొంతమంది వ్యక్తులు రేషన్ బియ్యం దందాను బహిరంగంగానే చేస్తున్నా అటు పౌరసరఫరా అధికారులు కానీ, ఇటు పోలీసులు కానీ తగిన చర్యలు తీసుకోకపోవటంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. రేషన్‌బియ్యం తరలింపులో కొంతమంది పోలీసుల అస్తం ఉందని అందుకే వారు బహిరంగంగా రేషన్‌బియ్యాన్ని తరలిస్తున్నారని స్థానికులు, షాపువాళ్లే తెలపటం విశేషం. పౌరసరఫరాశాఖ సర్కిల్ 9 కార్యాలయం పరిధిలో 54 రేషన్ దుకాణాలున్నాయి. ఒక్కో దుకాణానికి 300 క్వింటాళ్ల వరకు రేషన్‌బియ్యం సరఫరా అవుతాయి. ఇవి సరిపోకపోతే అడిషనల్‌గా మళ్లీ అర్డర్ పెట్టుకోవచ్చు. అడ్డగుట్ట, మాణికేశ్వరినగర్‌తోపాటు చిలకలగూడ, సీతాఫల్‌మండి, మైలార్‌గడ్డ, నామాలగుండు, వారాసిగూడ, బౌద్ధనగర్, షాబాద్‌గూడ, మహ్మద్‌గూడ తదితర ప్రాంతాల్లో ఈ షాపులున్నాయి. కొంతమంది వ్యక్తులు యువకులను ప్రత్యేకంగా నియమించి ఇంటింటికీ వెళ్లి కేజీ రేషన్ బియ్యాన్ని రూ.12 కొనుగోలు చేస్తారు. తర్వాత వాటిని ఓ ప్రాంతంలో డంపు చేస్తారు. మరికొంతమంది అక్రమార్కులు రేషన్‌షాపుల నుంచి నేరుగా బస్తాలు, బస్తాలు బియ్యాన్ని కొనుగోలు చేస్తారు. యాక్టివ్ హోండా ద్విచక్ర వాహనాలపై అర్ధరాత్రులు కొనుగోలు చేసిన రేషన్‌బియ్యాన్ని ఓ రహస్య ప్రాంతానికి తరలించి, అక్కడ నుంచి వాహనాల్లో బయటకు తరలిస్తారు. రేషన్‌బియ్యం దందా బహిరంగంగానే సాగుతున్నా స్థానికులు కానీ, పోలీసులు కానీ, పౌరసరఫరాశాఖ అధికారులు కానీ పట్టించుకోకపోవటం పలు అనుమానాలకు తావిస్తోంది.

సీతాఫల్‌మండి, వారాసిగూడలో మూడు గోడౌన్‌లు

రేషన్‌బియ్యాన్ని కొనుగోలు చేసిన అక్రమార్కులు మూడు గోడౌన్‌లకు తరలిస్తున్నారు. వారాసిగూడ పుల్లయ్యబావి, సీతాఫల్‌మండి డివిజన్ పరిధిలో రెడ్‌క్రాస్ ఆస్పత్రి ప్రాంతంలో మరో రెండు గోడౌన్‌లకు రేషన్‌బియ్యాన్ని తరలిస్తున్నారు. ముషీరాబాద్, పార్శీగుట్ట, వారాసిగూడ, బౌద్ధనగర్, సీతాఫల్‌మండి, చిలకలగూడ, మెట్టుగూడ తదితర ప్రాంతాల్లో కొనుగోలు చేసిన రేషన్‌బియ్యాన్ని అర్ధరాత్రులు గోడౌన్‌ల నుంచి చాదర్‌ఘాట్ వరకు తరలిస్తారు. ప్రతిరోజూ సుమారు 30 క్వింటాళ్ల రేషన్‌బియ్యం అక్రమ రవాణా అవుతోందని ఓ వ్యక్తి తెలిపాడు. వారాసిగూడ పుల్లయ్యబావిలో ఓ ఇంటి బయటే బహిరంగంగానే సీలు ఇప్పని రేషన్‌బస్తాలు, రేషన్‌బియ్యం మూటలు వేశారంటే.. ఈ దందా మూడుపువ్వులు, ఆరు కాయలు అన్న చందంగా నడుస్తోంది. ఇప్పటికైనా రేషన్‌బియ్యం అక్రమ రవాణాను నివారించాలని పలువురు ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేస్తున్నారు. పార్శీగుట్ట, అడ్డగుట్ట, ముషీరాబాద్ తదితర ప్రాంతాల్లో రేషన్‌బియ్యం అక్రమదందా ఎక్కువగా సాగుతోందని సమాచారం.



రోగుల సహాయకులకు భోజనం వడ్డిస్తున్న సేవా భారతి ప్రతినిధులు

'గాంధీ'లో సేవాభారతి ఉచిత సేవలపై ఆరా

అడ్డగుట్ట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్న జనహిత షెల్టర్ హోం కేంద్రాన్ని మంగళవారం మధ్యప్రదేశ్ భోపాల్ సేవా భారతి సంస్థ జాతీయ కార్యనిర్వాహక కార్యదర్శి విజయ్ పురానిక్ సందర్శించారు. గాంధీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగుల సహాయకులకు భోజన విషయంలో ఎలాంటి ఇబ్బందులూ కలుగకుండా సేవాభారతి ఉచితంగా ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం అందిస్తోందని, పడుకునేందుకు షెల్టర్‌ను ఏర్పాటు చేసిందని అన్నారు. సేవా భారతి ఉచిత సేవలపై మేనేజింగ్ ట్రస్ట్ సభ్యుడు నర్సింహమూర్తి షెల్టర్ హోం మేనేజర్ నందకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా గాంధీ, నిలోఫర్, ఎంఎన్‌జే ఆస్పత్రుల్లో ఉచిత హెల్ప్ డెస్కులను ఏర్పాటు చేశామని సేవా భారతి నిర్వాహకులు తెలిపారు.



శతక షట్కము పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

శతక షట్కము ఆవిష్కరణ

రవీంద్రభారతి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలుగు సాహిత్యంలో తరతరాలుగా నైతిక, వ్యవహారిక విలువలను అందజేస్తున్న శతకాల నుంచి ఎంచుకున్న ఆరు శతకాలను శతక షట్కము రూపంలో ప్రచురించడం అభినందనీయమని ఎమ్మెల్సీ సురభివాణి అన్నారు. మంగళవారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాల్‌లో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ, ఎం.వి.ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శతక షట్కము అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్సీ సురభి వాణి, విశిష్ట అతిథిగా సినీగేయ రచయిత సుద్దాల అశోక్‌తేజ, భాష్యం శ్రవణ్‌కుమార్, దైవజ్ఞశర్మ తదితరులు హాజరై శతక షట్కము పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడేలా సాహిత్యం ఉండాలన్నారు. సుద్దాల అశోక్‌తేజ మాట్లాడుతూ శతకషట్కము పుస్తకం ఈతరం యువత చదవాల్సిన అవసరముందన్నారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

సమ్మోహనం శౌర్య నాట్యం



నాట్యం చేస్తున్న శౌర్యసంపద

రవీంద్రభారతి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): లయబద్ధమైన నాట్యాంశాలకు వైవిధ్యభరితంగా నర్తించిన యువ నర్తకి శౌర్యసంపద ప్రేక్షకుల్ని సమ్మోహనపరిచింది. మంగళవారం రవీంద్రభారతిలో శ్రీసాయి నటరాజ అకాడమీ ఆఫ్ కూచిపూడి డ్యాన్స్ ఆధ్వర్యంలో ప్రముఖ నాట్యగురువు డా.పి.రమాదేవి శిష్యురాలైన మరిగంటి శౌర్యసంపద కూచిపూడి నాట్యంలో రంగప్రవేశం చేసింది. ఈ సందర్భంగా గణపతి స్తుతి, మండోదరి శబ్దం, మీనాక్షి మీముదం, జావళి, తిల్లాన తదితర అంశాల్లో నర్తించిన శౌర్యసంపద ఆహూతుల్ని అలరించింది. పలువురు ప్రముఖులు నర్తకి శౌర్యసంపదను సత్కరించి అభినందించారు. అనంతరం గురువు రమాదేవికి గురుసత్కారం చేశారు.

వెంకటేశ్వర్లుకు తెలుగుతేజం పురస్కారం

రవీంద్రభారతి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆదరణ వెల్ఫేర్ సొసైటీ, గ్లోబల్ హెల్ప్ ఫౌండేషన్‌లు భారత ప్రభుత్వ నీతి ఆయోగ్ సహకారంతో నిర్వహించిన జాతీయ కవి సమ్మేళనంలో తెలంగాణకు చెందిన రచయిత, కవి బులెమోని వెంకటేశ్వర్లుకు తెలుగు తేజం పురస్కారం ప్రదానంచేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా మార్కాపురంలో నిర్వహించిన ఈ జాతీయ కవి సమ్మేళనంలో ఇది కదా అసలైన తెలుగు వెలుగు కవితతో బులెమోని వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. కాగా, ఈ తెలుగు తేజం జాతీయ కవి సమ్మేళనంలో 200 మందికి పైగా కవులు తమ కవితలు చదివి వినిపించారు. అందులో బులెమోని వెంకటేశ్వర్లు వినిపించిన కవితను ఉత్తమ కవితగా ఎంపిక చేసిన రచయితను సత్కరించారు. తెలుగు తేజం పురస్కారం ప్రదానం చేశారు. పలువురు ప్రముఖులు వెంకటేశ్వర్లును సన్మానించి అభినందించారు.



కాలనీవాసులతో కలిసి ఒరిగిన వృక్షాన్ని పరిశీలిస్తున్న నాయకులు తేలుకుంట సతీష్ గుప్తా

రోడ్డుకు అడ్డంగా ఉన్న వృక్షాన్ని తొలగించండి

మారేడుపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ బోర్డు ఐదో వార్డు పరిధి బ్రూక్‌బాండ్ కాలనీలోనికి రాకపోకలు సాగించే ప్రధాన మార్గం మలుపులో భారీవృక్షం రోడ్డుకు అడ్డంగా ఒరిగి ప్రమాదకరంగా ఉంది. వాహనదారులు, స్థానిక కాలనీ వాసులకు ఒరిగిన వృక్షం కానరాక దానిని ఢీకొట్టుకుంటూ తరచూ ఏదో ఒక సమయంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. దీంతో పాటు చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలపై, కేబుళ్లపై పడి ఉండడంతో స్థానిక కాలనీవాసులు భయాందోళనకు గురవుతున్నారు. ప్లాట్ నెంబర్ 35, 36 వద్ద గల రెండు వృక్షాలు ప్రమాదకరంగా మారి ఉన్నాయని కంటోన్మెంట్ బోర్డు అధికారులకు సమాచారం ఇచ్చినప్పటికీ పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. వెంటనే కంటోన్మెంట్ బోర్డు శానిటేషన్ సూపరింటెండెంట్ స్పందించి సమస్య నివారణకు చర్యలు చేపట్టాలని సీనియర్ నాయకులు తేలుకుంట సతీష్ గుప్తా, కాలనీ ప్రతినిధి సంతోష్ అధికారులను కోరారు.



క్రిస్మస్ వేడుకల్లో భాగంగా కేక్‌కట్ చేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

క్రిస్మస్ వేడుకలు షురూ

మారేడుపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రపంచం మొత్తం జరుపుకునే ఏకైక పండుగ క్రిస్మస్ అని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. క్రిస్మస్ వేడుకల్లో భాగంగా మంగళవారం వెస్ట్ మారేడుపల్లిలోని కార్యాలయంలో ఎస్పార్ నగర్‌లోని క్రిస్టియన్ ఫెలోషిప్ చర్చి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే శ్రీనివాస్ యాదవ్ కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారికి ఆయన క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చర్చి కో పాస్టర్ జాయ్ సీమన్ పీటర్ ప్రతినిధులు పాల్ బసవయ్య, జాకీర్ హుస్సేన్, జాకోబ్, షీబా పాల్ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ కోసం శ్రీకాళహస్తికి వెళ్లిన వ్యక్తి అదృశ్యం



అబ్దుల్ జోసెఫ్ హిరామ్ షేక్

బౌద్ధనగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. వారాసిగూడ పోలీస్‌స్టేషన్ అడ్మిన్ ఎస్సై సుధాకర్ తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్ జోసెఫ్ హిరామ్ షేక్(47) ప్రైవేట్ ఉద్యోగం మానేసి, మూడు సంవత్సరాల నుంచి ఖాళీ ఉంటున్నాడు. మూడు నెలల క్రితం శ్రీకాళహస్తిలో తనకు ఉద్యోగం వచ్చిందని వెళ్లిన అబ్దుల్ జోసెఫ్ హిరామ్ షేక్ తిరిగిరాలేదు. తనభర్త కనిపించటం లేదని భార్య జలధి సంగీతలత వారాసిగూడ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



ఆర్పీఎఫ్ పోలీసులకు పట్టుబడ్డ నాగ్‌పూర్‌కు చెందిన ఇద్దరు మైనర్లు

షెల్టర్ హోమ్‌కు నాగ్‌పూర్ మైనర్లు

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి పారిపోయి వచ్చిన ఇద్దరు మైనర్లు నాంపల్లి రైల్వేస్టేషన్‌లో ప్రత్యక్షమయ్యారు. నాంపల్లి రైల్వే ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ కల్పన తెలిపిన వివరాల ప్రకారం.. నాగాపూర్‌కు చెందిన ఇద్దరు మైనర్లు మంగళవారం నాంపల్లి రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా ఆర్పీఎఫ్ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. నాగ్‌పూర్‌లో ఇంటి నుంచి కలిసి రైల్‌లో నాంపల్లికి వచ్చామని చెప్పారు. దీంతో ఇద్దరినీ ప్రభుత్వ షెల్టర్ హోమ్‌కు తరలించామని సీఐ తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి



సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టాలు దాటుతున్న ఓ వ్యక్తిని రైలు ఢీకొని అక్కడికక్కడే మరణించాడు. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ పండరి తెలిపిన వివరాల ప్రకారం.. చర్లపల్లి- ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ మధ్య గురువారం గుర్తుతెలియని 40 ఏళ్ల వ్యక్తి రైలు పట్టాలు దాటుతున్నాడు. ఈ క్రమంలో అతడిని రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మరణించాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

చెత్త లారీ ఢీకొని మరొకరు..



సుమన్ (ఫైల్)

కుషాయిగూడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చెత్త లారీ ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన చర్లపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం వరంగల్ జిల్లా, చెన్నారావుపేట మండలం, పాపాయపేట తండాకు చెందిన బడావత్ సుమన్(35) ప్రైవేటు ఉద్యోగి. మంగళవారం చర్లపల్లి పారిశ్రామికవాడలో చక్రిపురం వైపునకు ద్విచక్రవాహనంపై వెళ్తుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన చెత్త లారీ ఢీకొట్టింది. బైక్‌పై నుంచి కిందపడిన సుమన్ తలకు, కుడిభుజానికి గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు గాంధీ ఆస్పత్రికి తరలించగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్టు తెలిపారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ శేఖర్ తెలిపారు.

ఆగిన బైక్‌ను ఢీకొట్టిన కారు.. బాలికకు గాయాలు

హైదర్‌నగర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఆగిన బైక్‌ను కారు వేగంగా ఢీకొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న బాలిక కిందపడి తీవ్రగాయలయ్యాయి. కేపీహెచ్‌బీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రగతీనగర్‌కు చెందిన మేడూరి అశోక్ చక్రవర్తి మంగళవారం సాయంత్రం ఏపీ రాష్ట్రం తిరువూరు నుంచి వస్తున్న తన భార్య, కుమార్తెను ఇంటికి తీసుకెళ్లేందుకు వచ్చాడు. జేఎన్‌యూటీ వద్ద ద్విచక్రవాహనంపై కుమార్తె స్వేచ్ఛను ఎక్కించి భార్యాభర్త బైక్ ఎక్కుతుండగా వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు వీరి బైక్‌ను ఢీకొట్టింది. కిందపడిన స్వేచ్ఛకు తీవ్రగాయాలు కాగా హుటాహుటిన స్థానిక ఆస్పత్రికి తరలించారు. స్థానికులు కారు నడుపుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించగా మద్యం మత్తులో ఆక్సిడెంట్ చేసినట్టుగా పోలీసులు గుర్తించారు. అశోక్ చక్రవర్తి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గ్రూప్-4 అభ్యర్థులకు జేఎన్‌టీయూ షాక్

- రెండేళ్లదాకా వేరే ఉద్యోగాల దరఖాస్తుకు వీల్లేదన్న అధికారులు
- ఇతర శాఖల్లో లేని నిబంధనలు ఇక్కడెలా.. అంటున్న అభ్యర్థులు
- వర్సిటీలో మొత్తం 74 పోస్టులకు రిపోర్టు చేసింది 34 మందే..
- అంకితభావంతో పనిచేయాలని సూచించిన ఇన్‌చార్జి వీసీ

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): టీజీపీఎస్సీ గ్రూప్- 4 ద్వారా ఎంపికై జేఎన్‌టీయూకు వచ్చిన ఉద్యోగులకు అధికారులు షాక్ ఇచ్చారు. యూనివర్సిటీ నిబంధనల ప్రకారం ఒకసారి జాయినింగ్ రిపోర్టు ఇచ్చిన అభ్యర్థులు మరో రెండేళ్ల వరకు ఏ ఇతర ఉద్యోగాలకు దరఖాస్తు చేసేందుకు వీల్లేదని స్పష్టం చేశారు. జాయినింగ్ రిపోర్టు ఇచ్చే సందర్భంగా అభ్యర్థుల నుంచి తీసుకునే డిక్లరేషన్‌లో 12వ పాయింట్‌గా అధికారులు ఈ నిబంధనను పొందుపరిచారు. ఈ నిబంధనతో భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థాయి ఉద్యోగ పరీక్షలకు హాజరు కావాలనుకుంటున్న అభ్యర్థుల ఆశలపై నీళ్లు చల్లినట్టయింది. దీంతో జాయినింగ్ రిపోర్టు ఇచ్చేందుకు యూనివర్సిటీకి వచ్చిన అభ్యర్థుల్లో సగానికి పైగా అభ్యర్థులు మరోమారు ఆలోచించుకొని వస్తామంటూ వెనుదిరిగారు. ఉద్యోగ నోటిఫికేషన్‌లో ఈ తరహా నిబంధనలు ఏవీ లేవని, ఒకవేళ ముందుగా తెలిసి ఉంటే జేఎన్‌టీయూను ఎంచుకునే వాళ్లం కాదని పలువురు అభ్యర్థులు వాపోయారు.

జేఎన్‌టీయూ అంటే హైదరాబాదే అనుకున్నం..

అలాగే, జేఎన్‌టీయూలో పోస్టింగ్ అంటే.. హైదరాబాద్‌లో అనుకున్నామని, వర్సిటీకి అనుబంధంగా ఉన్న కాలేజీలకు ఆప్షన్లు ఇవ్వమని అడిగేదాకా జిల్లాలకు పంపుతారని తెలియదని మరికొందరు అభ్యర్థులు గందరగోళానికి గురయ్యారు. మొత్తం 74 పోస్టుల్లో 40 పోస్టులు మాత్రమే హైదరాబాద్‌లో అని, మిగిలిన 34 పోస్టులు సుల్తాన్‌పూర్, మంథని, జగిత్యాల కాలేజీలో ఉన్నట్టు వర్సిటీ అధికారులు అభ్యర్థులకు తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ల రిక్రూట్‌మెంట్‌కు సంబంధించి టీజీపీఎస్సీ రూల్స్, జేఎన్‌టీయూ నిబంధనలు వేర్వేరుగా ఉండడంతో అభ్యర్థులు గందరగోళానికి గురయ్యారు. వర్సిటీ అధికారులు చెప్పిన కొత్త నిబంధనలపై టీఎస్‌పీఎస్సీ అధికారులతో మాట్లాడతామని, ప్రభుత్వశాఖల్లో మాదిరే వర్సిటీ నిబంధనలను సవరించాలని కోరతామని పేర్కొన్నారు. జేఎన్‌టీయూలో మొత్తం 74 జూనియర్ అసిస్టెంట్ పోస్టులను నోటిఫికేషన్‌లో పేర్కొనగా, మంగళవారం వరకు కేవలం 34మందే జాయినింగ్ రిపోర్టు ఇచ్చినట్టు తెలిసింది.



గ్రూప్4 అభ్యర్థులకు దిశానిర్దేశం చేస్తున్న వీసీ, రెక్టార్, రిజిస్ట్రార్

అంకితభావంతో పనిచేయండి : ఇన్‌చార్జి వీసీ

జేఎన్‌టీయూలో ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు అంకితభావంతో పనిచేయాలని వర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్స్‌లర్ డాక్టర్ బాలకిష్టారెడ్డి సూచించారు. గ్రూప్4 ద్వారా ఎంపికై యూనివర్సిటీలో ఉద్యోగాలు దక్కించుకున్న అభ్యర్థులందరికీ శుభాకాంక్షలు తెలిపారు. మీతో పాటు నేను కూడా యూనివర్సిటీకి కొత్తగా వచ్చానని, ఎంతో కాలంగా పనిచేస్తున్న సీనియర్ అధికారులు మీకు మార్గనిర్దేశం చేస్తారని చెప్పారు. ఉన్నతాధికారులు సూచనల మేరకు నిబద్ధతతో పనిచేయాలని సూచించారు.

సర్వీసు నిబంధనల ప్రకారం మీకు పదోన్నతులు లభిస్తాయని, ప్రతియేటా అప్రయిజల్ రిపోర్టు ద్వారా మీ పనితీరును సమీక్షిస్తామని చెప్పారు. గ్రూప్ - 4 అభ్యర్థులకు కౌన్సెలింగ్ కార్యక్రమంలో వీసీతో పాటు రెక్టార్ విజయకుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.